శనివారం 20-4-2024

# ముందడుగు

సంపుటి: 1, సంచిక: 311, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

దినపత్రిక

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com

## తొలి విడత సమరం ముగిసింది

### పలుచోట్ల స్వల్ప హింసాత్మక ఘటనలు ● 60% పోలింగ్ నమోదు

**ముందడుగు జాతీయం:**



దేశంలో సార్వత్రిక ఎన్నికల తొలి విడత పోలింగ్ సమరం శుక్రవారం ముగిసింది. కొన్ని చోట్ల స్వల్ప హింసాత్మక ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సాయంత్రం 5గంటల వరకు 59.7% పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. ఓటేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చి క్యూలైన్లలో ఉన్నవారికి అవకాశం కల్పించారు. తొలి విడతలో 21 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 లోక్‌సభ స్థానాలతో పాటు అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే.

#### రాష్ట్రాల వారీగా పోలింగ్ శాతం

అండమాన్ నికోబార్‌దీవులు 56.87%, అరుణాచల్‌ప్రదేశ్ 64.91, అస్సాం 70.77, బిహార్ 46.32, ఛత్తీస్‌గఢ్63.41, జమ్మూకశ్మీర్ 65.08, లక్షద్వీప్ 59.02, మధ్యప్రదేశ్ 63.25, మహారాష్ట్ర 54.85, మణిపూర్ 68.62, మేఘాలయ 69.91, మిజోరం 53.96, నాగాలాండ్ 56.77, పుదుచ్చేరి 72.84, రాజస్థాన్ 50.27, సిక్కిం 68.06, తమిళనాడు 62.08, త్రిపుర 79.83, ఉత్తరప్రదేశ్ 57.54, ఉత్తరాఖండ్ 53.56, పశ్చిమబెంగాల్ 77.57 చొప్పున పోలింగ్ శాతం నమోదైంది. లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న అరుణాచల్‌ప్రదేశ్‌లో 66.94శాతం, సిక్కింలో 67.95శాతం చొప్పున నమోదైనట్లు పేర్కొంది.

## మా ఎమ్మెల్యేలను టచ్ చేస్తే.. మసైపోతావు

- కారు షెడ్డు నుంచి బయటకు రాదు
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ముందడుగు మహబూబ్‌నగర్:**



తెలంగాణలో కారు ఇంకా బయటికి రాదని, అది పాడైపోయిందని షెడ్డుకే పరిమితం అని బిఆర్ఎస్ పార్టీని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మహబూబ్‌నగర్‌లో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని కేసీఆర్ అంటున్నారు. ఇక్కడ కాపలా ఉన్నది రేవంత్‌రెడ్డి. మా ఎమ్మెల్యేలను టచ్ చేస్తే.. మాడి మసైపోతావు. పాలమూరులో అనేక ప్రాజెక్టులు చేపట్టాం. పదేళ్లుగా ఈ జిల్లాను ఎడారిగా మార్చారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తెచ్చారా? పార్లమెంటులో నిద్రపోవడానికా బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలి?'' అని రేవంత్ ప్రశ్నించారు.




## బస్సు యాత్రకు సిద్ధమవుతున్న కేసీఆర్

- ఈ నెల 22 నుంచి మే 10వ తేదీ వరకు
- అనుమతి కోసం ఈసీని కలిసిన నాయకులు

**ముందడుగు హైదరాబాద్:**

దేశంలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించారు. ఈ నెల 22 నుంచి మే 10వ తేదీ వరకు తెలంగాణ మిగతా 2లో



## యూపీ ప్రజలు ఇద్దరినీ తిరస్కరించారు

- ఐనా ప్రజల ముందుకు వస్తున్నారు
- యూపీ అమ్రోహా ర్యాలీలో మోడీ ప్రసంగం

**ముందడుగు ఉత్తరప్రదేశ్:**

ఉత్తరప్రదేశ్ ప్రజలు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీల మధ్య పొత్తును ప్రస్తావిస్తూ 'ఇద్దరు యువరాజులు నటించిన చిత్రాన్ని' ఉత్తరప్రదేశ్ మిగతా 2లో



## ఇప్పటివరకు మూడే మామిడి పండ్లు తిన్నా

- ఒక్కసారి మాత్రమే ఆలూపూరీ తిన్నాను
- రౌజ్ అవెన్యూ కోర్టుకు కేజ్రీవాల్ వెల్లడి
- రెండు పిటిషన్లపై తీర్పు రిజర్వ్

**ముందడుగు జాతీయం:**

ఒక్కసారి మాత్రమే ఆలూపూరీ తిన్నాను, 48 సార్లు భోజనంలో కేవలం మూడు మామిడి పండ్లు తీసుకున్నానని ఢిల్లీ మిగతా 2లో

ముందడుగు
శనివారం
20-4-2024
హైదరాబాద్

# సంతానం కోసం గరుడ ప్రసాదం

## 30 కిలో మీటర్ల మేర నిలిచిన వాహనాలు

ముందడుగు హైదరాబాద్:

సంతానం లేని వారికి గరుడ ప్రసాదం వితరణపై ప్రచారం నేపథ్యంలో హైదరాబాద్ శివారులోని చిలుకూరు బాలాజీ ఆలయం వైపు వెళ్లే మార్గంలో ఉదయం నుంచే భారీగా భక్తులు ఆలయానికి పోటె త్తారు. ఈ క్రమంలో దాదాపు 30 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోగా.. వాహనాదారులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మాసబ్ ట్యాంక్ నుంచి మె హదీపట్నం, నానల్ నగర్, లంగర్ హౌస్, సన్ సిటీ, అప్పా జంక్షన్ మీదుగా చిలుకూరు ఆలయం వరకూ ట్రాఫిక్ స్తంభించిపోయింది. గచ్చిబౌలిలోని ఔటర్ రింగ్ సర్వీస్ రోడ్డు కూడా వాహనాలతో నిండిపోయిం ది. దాదాపు లక్ష మంది వరకూ వాహనాల్లో వెళ్లినట్లు అంచనా వేస్తుండగా.. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. శుక్రవారం గరుత్మంతునికి నైవేద్యం సమర్పించారు. అనంతరం సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదం పంచను న్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ ఇటీవల ప్రకటించారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో ఒక్కసారిగా ఆలయానికి భక్తులు పోటె త్తారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల నుంచే భాగ్యనగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. కార్లు, ఇతర వాహనా ల్లో తరలి రావడంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఈ క్రమంలో భక్తులు తమ బైక్స్, కార్లు పార్క్ చేసి కిలోమీటర్ల మేర కాలినడకన ఆలయానికి వస్తున్నారు.



# బస్సు యాత్రకు సిద్ధమవుతున్న కేసీఆర్

మొదటిపేజీ తరువాయి

వ్యాప్తంగా కేసీఆర్ బస్సు యాత్ర చేపట్టనున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ బస్సు యాత్ర పర్మిషన్‌పై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్‌ను బీఆర్ఎస్ నాయకులు కే వాసుదేవా రెడ్డి శుక్ర వారం కలిశారు. ఈ మేరకు బస్సు యాత్ర వివరాలను వికాస్ రాజ్‌కు వాసుదేవా రెడ్డి అందజేశారు. ఈ నేపథ్యంలో యాత్రకు సంబంధించి భద్రతా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యాత్రకు పోలీసుల సహకారం అందించేలా చూడాలని కోరారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చూడాలని వాసుదేవా రెడ్డి కోరారు.

ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 34 అసెంబ్లీ నియో జకవర్గాల్లో రోడ్ షోలుంటాయని, పార్టీకి అనుకూలంగా ఉండే రూట్‌మ్యాప్‌ను, ప్రదేశాలను నాయకులే కూర్చొని నిర్ణయించా లని నిన్న జరిగిన బీఆర్ఎస్ మీటింగ్‌లో కేసీఆర్ సూచించారు. రోడ్‌షోలు ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య ఉంటాయని, తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటాయని తెలిపారు. బస్సుయాత్రలు చేస్తూనే మధ్యలో బహిరంగ సభల్లో కూడా పాల్గొంటానని చెప్పారు. సిద్దిపేట, వరంగల్ సహ మరికొన్ని ప్రాంతాల్లో కూడా కొన్ని బహిరంగ సభలు ఉంటాయన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేయాలని కోరారు.

# ప్రపంచంలోనే అత్యంత పొట్టి మహిళ ఓటేసింది

## మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన జ్యోతి ఆమ్గే

ముందడుగు మహారాష్ట్ర:



దేశంలో లోక్‌సభ తొలిదశ ఎన్నికల పోలింగ్ కొనసాగుతు న్నది. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరారు.సాధారణ పౌరులతో పాటు సినీనటులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు తమ ఓటుహక్కు వినియోగించుకుం టున్నారు. ఈ క్రమంలో ప్రపం చంలోనే అత్యంత పొట్టి మహిళ జ్యోతి ఆమ్గే మహారాష్ట్రలోని నా గ్‌పూర్‌లో ఓటేశారు. కుటుంబ సమేతంగా పోలింగ్ కేంద్రానికి వచ్చిన జ్యోతి.. అందరితోపాటు క్యూలైన్‌లో నిల్చుని ఓటు వేశారు. అనంతరం మాట్లాడుతూ..ప్రతి ఒక్కరు ఓటు వేయాలని, అది మన విధి అని విజ్ఞప్తి చేశారు. దేశ పౌరులుగా అది మన బాధ్యత అని చెప్పారు. తనతోపాటు తన కుటుంబ సభ్యులంతా ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. తాను చదువుకు న్న స్కూల్‌లోనే ఓటు వేశానన్నారు.

# పెదవులను అతికించి.. నెల రోజులుగా అత్యాచారం

## మధ్యప్రదేశ్‌లో అమానవీయ ఘటన

ముందడుగు మధ్యప్రదేశ్:

పొరుగింటి వ్యక్తి ఒక యువతిని నెల రోజుల పాటు బంధించి, అత్యాచారానికి పాల్ప డ్డాడు. ఆమె కేకలు ఎవరికీ వినిపించకుండా పెదవులను అంటించడమే కాకుండా.. గాయాలపై కారం చల్లి, హింసించాడని మీడియా కథనాలు పేర్కొన్నాయి. అమాన వీయ ఘటన మధ్యప్రదేశ్‌లో జరిగింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..

గుణ ప్రాంతంలో బాధితురాలు తన తల్లితో కలిసి నివసిస్తోంది. నెల రోజుల క్రితం నిందితుడు ఆమెను బలవంతంగా లాక్కెళ్లి తన ఇంట్లో బంధించాడు. దాంతో ఆమె తప్పించుకోవడానికి వీలులేకుండా పోయింది. తనను పెళ్లి చేసుకోవాలని, తల్లిదం డ్రుల పేరిట ఉన్న ఆస్తిని అప్పగించాలని వేధించినట్లు సదరు యువతి పోలీసులకు తెలిపింది. ఈ క్రమంలోనే లైంగికంగా వేధించి, బెల్ట్, వాటర్ పైపులతో కొట్టేవాడని తెలిపింది. అయితే మంగళవారం రాత్రి ఆమె తప్పించుకోవడానికి అవకాశం దొరక డంతో.. అక్కడినుంచి బయటపడి, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలీసుస్టేషన్‌కు చేరుకుంది. పెదవులు అంటించి ఉండటం, కళ్లు వాచి పోయి, ఒళ్లంతా గాయాలతో ఉన్న ఆమెను చూసి పోలీసులు చలించిపోయారు. వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు. ఉన్నతాధికారి ఒకరు మీడియాతో మాట్లాడుతూ.. బాధితురాలి ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు. ఈ ఘటన సమయంలో ఆమె తల్లి వేరే ఊరిలో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

# యూపీ ప్రజలు ఇద్దరినీ తిరస్కరించారు

మొదటిపేజీ తరువాయి

ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని ప్రధాని మోదీ శుక్రవారం అన్నారు. అయినా వారు మరలా ప్రజల ముందుకువస్తున్నారని విమర్శించారు. యూపీలోని అమ్రోహాలో జరిగిన ర్యాలీలో ప్రసం గించిన మోదీ ప్రతిపక్షాలు మా విశ్వాసంపై దాడి చేస్తున్నాయని ఆరోపించారు. అంతేకాకుండా అవి 'అవినీతి, బంధుప్రీతి, బు జ్జగింపుల' బుట్టను మోస్తూ ఓట్లు అడగడానికి బయల్దేరాయని అసహనం వ్యక్తంచేశారు.

అయోధ్యలోని రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ వేడుకలకు ఆహ్వానిస్తే సమా జ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ తిరస్కరించాయని ఆయన విమర్శించారు. ''యూపీలో సమాజ్‌వాదీ పార్టీ 63 స్థానాల్లో, కాంగ్రెస్ 17 స్థానా ల్లో పోటీ చేస్తున్నాయి. ఇక్కడ కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న అభ్య ర్థికి 'భారత్ మాతా కీ జై' అని చెప్పడం కూడా కష్టం.'' అని మోదీ దుయ్యబట్టారు. 2017 లోక్‌సభ ఎన్నికల్లో అఖిలేష్ యాదవ్, రాహుల్ గాంధీ పొత్తు పెట్టుకున్నారు. అయితే బీజేపీ వీరిని భారీ మెజారిటీతో ఓడించింది.

# ఇప్పటివరకు మూడే మామిడి పండ్లు తిన్నా

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వెల్లడిం చారు. అది కూడా నవరాత్రి ప్రసాదమని శుక్రవారం ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టుకు వెల్లడించారు. తిహార్ జైల్లో తనకు ఇన్సులి న్ అందించాలని కోరుతూ వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా తన వాదనను వినిపిం చారు. మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఆమ్‌ఆ ద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ప్రస్తుతం తిహార్ జైల్లో ఉన్నారు. చక్కెర స్థాయిల్లో తీవ్ర హెచ్చుతగ్గులు ఉన్న నేపథ్యంలో తన రెగ్యులర్ డాక్టర్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంప్రదిం చేందుకు అనుమతించాలని కోరుతూ ఆయన ఇటీవల ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం ఢిల్లీ సీఎం అభ్యర్థనను వ్యతిరేకించిన ఈడీ.. ఆయనపై ఆరోపణలు చేసింది. ఆరోగ్య కారణాల కింద బెయిల్ పొందడం కోసం ఆయన ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నారు'' అని దర్యాప్తు సంస్థ కోర్టుకు తెలిపింది జైల్లో రోజుకు రెండుసార్లు కేజ్రీవాల్ షుగర్ లెవల్స్‌ను వైద్యులు చెక్ చేస్తున్నారని ఈడీ వెల్లడించింది. ఏప్రిల్ 1వ తేదీన జైలుకు తరలించిన రోజుతో పోలిస్తే ఇప్పుడు ఆయన చక్కెరస్థాయిలు రెట్టింపు అయినట్లు పేర్కొంది. ఈడీ ఆరోపణలను సీఎం తరఫు న్యాయవాది ఖండించారు. ఆయనకు ఇంటి భోజన సదుపాయం నిలిపివేసేందుకే ఇలా కుట్రపూ రిత ఆరోపణలు చేస్తున్నారని వాదించారు. దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం జైల్లో కేజ్రీవాల్ తీసుకుంటున్న భోజనంతో పాటు ఆయన డైట్ ఛార్ట్‌పై నివేదిక ఇవ్వా లని తిహార్ జైలు నిన్న అధికారులను ఆదేశిం చింది. నేడు మరోసారి వాదనలు విన్న కోర్టు.. రెండు పిటిషన్లపై తీర్పును రిజర్వ్ చేసింది.


ముందడుగు
శనివారం
20-4-2024
హైదరాబాద్

# తలనొప్పి కారణంగా 24 ఏళ్ల లేడీ డాక్టర్ మృతి

## మైగ్రేన్ తప్ప ఇతర సమస్యలు లేవని వెల్లడి

**ముందడుగు కర్ణాటక:**

తలనొప్పి కారణంగా 24 ఏళ్ల లేడీ డాక్టర్ నిద్రలోనే చనిపోయిన ఘటన తీవ్ర సంచలనంగా మారింది. అయితే ఆమెకు మైగ్రేన్ తప్ప ఇతర అనారోగ్య సమస్యలేవీ లేవని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఆమె తరచూ మైగ్రేన్‌తో బాధపడుతూ ఉండేదని పేర్కొన్నారు. దీంతో మైగ్రేన్ ప్రాణాలు తీస్తుందా అనే ప్రశ్న ప్రస్తుతం ఈ విషయం విన్న ప్రతీ ఒక్కరిలో తలెత్తుతోంది.



కర్ణాటకలోని మంగళూరుకు చెందిన 24 ఏళ్ల డెంటిస్ట్ స్వాతి శెట్టి తీవ్రమైన తలనొప్పితో మృతి చెందిందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెను పరిశీలించిన డాక్టర్లు చెప్పిన వివరాల ప్రకారం.. స్వాతి శెట్టి తన తల్లితో రాత్రి ఫోన్ మాట్లాడిందని.. తనకు బాగా తలనొప్పిగా ఉందని.. తర్వాతి రోజు మాట్లాడుతానని ఫోన్ పెట్టేసినట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత రాత్రి ఆమె నిద్రపోయింది. తర్వాతి రోజు తెల్లవారుజామున స్వాతి శెట్టిని లేపడానికి ఆమె రూమ్‌మేట్ ప్రయత్నించింది.

ఎంత లేపినా లేవకపోవడంతో స్వాతి శెట్టిని పట్టుకుని చూడగా.. ఆమె శరీరం మొత్తం చల్లగా మారింది. వెంటనే ఆ రూమ్‌మేట్ స్వాతి శెట్టిని దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మరణించినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ విషయం తెలుసుకున్న స్వాతి శెట్టి కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. స్వాతి శెట్టికి కేవలం మైగ్రేన్ సమస్య మాత్రమే ఉందని.. అంతకుమించి ఎలాంటి అనారోగ్యం లేదని స్పష్టం చేశారు.

# కెనడా చరిత్రలోనే అతిపెద్ద బంగారం దోపిడీ

## నిందితుల్లో ఇద్దరు భారత సంతతికి చెందిన వారు

**ముందడుగు క్రైమ్:**

కెనడా చరిత్రలోనే 2023 ఏప్రిల్ 17న టోరంటో ఎయిర్ పోర్టులో అతిపెద్ద బంగారం దోపిడీ జరిగిన సంఘటన మనకు తెలిసిందే. తాజాగా ఈ కేసు సంబంధించి మొత్తం ఆరుగురిని అధికారులు ఏప్రిల్ 17 బుధవారం నాడు అధికారులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిలో ఇద్దరు భారతీయ సంతతికి చెందిన వారు కూడా ఉండడం గమనార్హం. ఇప్పటికే ఈ కేసులో మరో ముగ్గురికి కూడా అధికారులు వారెంట్లను జారీ చేశారు.




గత ఏడాది 22 మిలియన్ డాలర్ల విలువ కలిగిన బంగారం, విదేశీ కరెన్సీని తీసుకెళ్తున్న ఎయిర్ కార్గో కంటైనర్ ను కొందరు దొంగలించారు. ఈ దోపిడీలో స్విజర్లాండ్ లోని జ్యూరిచ్ నగరం నుండి ఎయిర్ కెనడా విమానంలో వచ్చిన కంటైనర్ ను నకిలీ డాక్యుమెంట్స్ తో వారు చోరీ చేయడం జరిగింది. ఈ చోరీ సమయంలో ఇద్దరు ఎయిర్ డిపార్ట్మెంట్ సంబంధించి కెనడా మాజీ ఉద్యోగులు సాయం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం వారిద్దరూ పోలీసులు కస్టడీలో ఉన్నారు. ఈ కేసుకు సంబంధమున్న మరో ఇద్దరికీ కూడా అరెస్టు వారంటీని జారీ చేశారు. గత సంవత్సరం జరిగిన దోపిడీ కేసులో సంవత్సరం రోజులపాటు విచారణ జరిగిన అనంతరం నిందితులను తాజాగా అరెస్టు చేశారు. ఈ కేసు లో అరెస్ట్ అయిన వారిలో ఇద్దరు భారతీయ సంతతికి చెందిన అంటారియోకు చెందిన పర్మ్ పాల్ సిద్ధూ, అమిత్ జలోటా లు ఉండగా.. వీరితోపాటు అమ్మద్ చైదరి, అలి రజా, ప్రసాద్ పరమలింగంను కూడా అరెస్ట్ చేశారు అధికారులు. ఇది ఇలా ఉండగా దోపిడీ జరిగిన సమయంలో పరంపల్ సిద్ధూ ఎయిర్ కెనడాలో పనిచేయడం గమనార్హం.

# మహిళను కత్తితో పొడిచి చంపిన వ్యక్తి

## నిందితుడిని హత్య చేసిన మహిళ తల్లి

**ముందడుగు కర్ణాటక:**

తను ఇష్టపడిన మహిళ తనకు దూరంగా ఉంటుందన్న ఆగ్రహంతో ఒక వ్యక్తి కత్తితో పొడిచి మహిళను హత్య చేశాడు. కుమార్తె కోసం వచ్చిన ఆమె తల్లి రాయితో తలపై కొట్టి అతడిని చంపింది. జంట హత్యలు స్థానికంగా కలకలం రేపాయి. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. 24 ఏళ్ల అనూష, 44 ఏళ్ల సురేష్ మధ్య ఐదేళ్లుగా పరిచయం ఉంది. అయితే తనను దూరం పెడుతున్న అనూషపై సురేష్ పగ పెంచుకున్నాడు. గురువారం సాయంత్రం పార్కులో కలుసుకుందామని ఆమెకు ఫోన్ చేశాడు. ఒక వ్యక్తిని పార్కులో కలిసి ఐదు నిమిషాల్లో తిరిగి వస్తానని అనూష తన తల్లికి చెప్పింది. జయనగర్ ప్రాంతంలోని పార్కుకు ఆమె బయలుదేరింది. అనుమానించిన తల్లి కొంత సేపటి తర్వాత అనూషను అనుసరించింది.




మరోవైపు పార్కులో వేచి ఉన్న సురేష్ అక్కడకు వచ్చిన అనూషను కత్తితో పలుమార్లు పొడిచాడు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. అప్పుడే పార్కుకు చేరుకున్న అనూష తల్లి ఇది చూసి ఆగ్రహంతో రగిలిపోయింది. పెద్ద రాయితో సురేష్ తలపై కొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే చనిపోయాడు. అనూషను ఆసుపత్రికి తరలించగా ఆమె కూడా మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు జంట హత్యలపై వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రెక్కింగ్ కోసం వెళ్లి తెలుగు విద్యార్థులు మృతి

## స్కాట్లాండ్‌లో నీటిలో జారిపడ్డ ఇద్దరు యువకులు

**ముందడుగు జాతీయం:**

ఉన్నత చదువుల కోసం స్కాట్లాండ్ వెళ్లిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు యువకులు ఊహించని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. స్నేహితులతో కలిసి సరదాగా ట్రెక్కింగ్ కు వెళ్లిన యువకులు ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి మృతి చెందారు. ఈ విషాద ఘటన స్కాట్లాండ్‌లో చోట చేసుకుంది. జితేంద్రనాథ్ కరుటూరి (26), చాణక్య బొలిశెట్టి (22) స్కాట్లాండ్‌లోని డూండీ యూనివర్సిటీలో మాస్టర్స్ చదువుతున్నారు. బుధవారం సాయంత్రం మరికొందరు భారత స్నేహితులతో కలిసి పెర్త్‌షైర్‌లోని 'లిన్ ఆఫ్ తమ్మెల్' కి వెళ్లారు. రెండు నదులు కలిసే ప్రాంతంలో వీరు ట్రెక్కింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి నీటిలో పడి కొట్టుకుపోయారు. ఘటనపై సమాచారం అందుకున్న సహాయక బృందాలు వెంటనే అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టాయి. ఘటన



జరిగిన ప్రదేశానికి కొద్ది దూరంలో వీరి మృతదేహాలను గుర్తించారు. ఈ ప్రమాదంపై లండన్‌లోని భారత హైకమిషనర్ స్పందిస్తూ.. మృతుల కుటుంబాలకు సమాచారం అందించామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను భారత్ కు పంపించే ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. తమ వర్సిటీ విద్యార్థులు మృతి చెందడం పట్ల డూండీ యూనివర్సిటీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. కాగా, జితేంద్రనాథ్ గతంలో అమెరికాలోని కనెక్టికట్ యూనివర్సిటీలో చదివినట్లు సమాచారం. మరో విద్యార్థి చాణక్య 2022లో హైదరాబాద్ జేఎన్టీయూలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినట్లు తెలిసింది.




# ప్రభుత్వ ఆసుపత్రులలో టెలి మెడిసిన్ సేవలు ఉన్నాయా..?

**యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆర్టీఐ దరఖాస్తు**

**ముందడుగు :**

తెలంగాణ రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో టెలి మెడిసిన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఏఏ సమయాలలో టెలి మెడిసిన్ సేవలు పనిచేస్తున్నాయి. టెలి మెడిసిన్ సేవలు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల పేరు, వాటి ఫోన్ నంబర్లు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా జాబితా అందించగలరని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ తెలంగాణ చీఫ్ సెక్రటరీ కార్యాలయానికి సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేయడం జరిగింది.

ముందడుగు
శనివారం
20-4-2024
హైదరాబాద్




# నాగాలాండ్ 6 జిల్లాల్లో ఒక్కరూ ఓటు వెయ్యలే

## 20 మంది ఎమ్మెల్యేలూ పోలింగ్ వైపు రాలేదు

**ముందడుగు నాగాలాండ్:**

నాగాలాండ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో మాత్రం 6 జిల్లాల్లో 'సున్నా శాతం' పోలింగ్ నమోదు కావడం గమనార్హం. స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు లక్షల మంది ఓటర్లు ఈ ప్రక్రియకు దూరంగా ఉన్నారు. దీంతో ఎన్నికల సిబ్బంది తొమ్మిది గంటలపాటు నిరీక్షించి వెళ్లిపోయారు.

నాగాలాండ్‌లో ఆరు జిల్లాల పరిధిలో నాగా తెగకు చెందిన వారున్నారు. రాష్ట్రంలో మొత్తం 13.25 లక్షల ఓటర్లు ఉండగా.. ఈ ఆరు జిల్లాల్లో 4,00,632 మంది ఉన్నారు. 20 శాసనసభ స్థానాల పరిధిలో మొత్తంగా 738 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ సమయం కేటాయించినప్పటికీ.. ఒక్కరు కూడా ఓటు వేయడానికి ముందుకురాలేదు. 20 మంది ఎమ్మెల్యేలూ ఓటు హక్కును వినియోగించుకోలేదని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ప్రత్యేక రాష్ట్రం డిమాండు చేస్తూ నాగా తెగ ప్రజలు 2010 నుంచి పోరాటం చేస్తున్నారు. ఏడు గిరిజన తెగలు కలిసి ఈస్టర్న్ నాగాలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్‌గా ఏర్పడి తమ గళాన్ని వినిపిస్తున్నాయి. ఎన్నోఏళ్లుగా తమ ప్రాంతం నిర్లక్ష్యానికి గురయ్యిందని చెబుతోన్న ఈఎన్‌పీవో.. ఏప్రిల్ 18 సాయంత్రం నుంచే నిరవధిక బంద్ పాటించాలని ఇటీవల ప్రకటించింది. దీంతో పోలింగ్ రోజున లక్షల మంది ఓటర్లు ఇళ్లకే పరిమితమయ్యారు. అధికారులు, అత్యవసర సేవలు మినహా రోడ్లపై ఏ ఒక్క వ్యక్తి, వాహనం కనిపించలేదు. అయినప్పటికీ అక్కడ శాంతియుత వాతావరణమే నెలకొందని అధికారులు వెల్లడించారు.

# పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఫేషియల్



## ప్రధానోపాధ్యాయురాలిపై విచారణకు ఆదేశం

**ముందడుగు ఉత్తరప్రదేశ్:**

ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఫేషియల్ చేయించుకుంది. సోషల్‌మీడియాలో ఫోటోస్ వైరల్‌గా మారాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉన్నావ్ జిల్లా, దండమౌ గ్రామంలోని ఓ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంగీతాసింగ్ విద్యార్థులకు పాఠాలు బోధించకుండా పాఠశాలలో ఫేషియల్ చేయించుకున్నారు. విద్యార్థులకు ఆహారం వండే గదిలో ప్రధానోపాధ్యాయురాలు ఫేషియల్ చేయించుకుంటుండగా అనమ్ ఖాన్ అనే ఉపాధ్యాయురాలు దాన్ని వీడియో తీశారు. దీన్ని గమనించిన సంగీతాసింగ్ ఒక్కసారిగా కుర్చీపై నుంచి లేచి ఉపాధ్యాయురాలితో వాగ్వాదానికి దిగారు. అనంతరం ఆమెపై దాడి చేసి ఫోన్ లాక్కునే క్రమంలో చేయిని కొరకడంతో ఉపాధ్యాయురాలికి గాయమై రక్తస్రావం అయ్యింది.

ప్రధానోపాధ్యాయురాలు ఫేషియల్ చేయించుకుంటున్న వీడియోతో పాటు తాను గాయాలతో ఉన్న వీడియోను సైతం అనమ్ ఖాన్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో రెండు వీడియోలు వైరల్‌గా మారాయి. దీనిపై స్పందించిన విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయురాలిపై విచారణకు ఆదేశించారు. అనమ్‌ను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధిత ఉపాధ్యాయురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై తదుపరి విచారణ కొనసాగుతుందన్నారు.

# వడదెబ్బ నుండి ఇలా తప్పించుకోండి

- తక్షణ చికిత్స అందకపోతే ప్రాణాంతకమే
- ఈ కాలంలో ముందు జాగ్రత్తలు తప్పనిసరి



**ముందడుగు ప్రత్యేకం:**

ఎండలు మండుతున్నాయి.. భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. తెలుగు రాష్ట్రాల్లోని చాలా జిల్లాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడగాలుల కారణంగా బయట పని చేసేవారు ఇబ్బంది పడుతున్నారు. ఎంతోమంది వడదెబ్బ బారిన పడుతున్నారు. ఇది వేడి అలసటతో కూడిన తీవ్రమైన పరిస్థితి. తక్షణమే చికిత్స అందించకపోతే ప్రాణాంతకం కావచ్చు. వడదెబ్బకు గురైతే, సహజ శీతలీకరణకు కారణమయ్యే చెమట శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో విఫలమవుతుంది. దీంతో శరీర ఉష్ణోగ్రత పెరిగిపోతుంది. వడదెబ్బ అనేది అధిక ఉష్ణోగ్రతలకు బహిర్గతం కావడం వల్ల వచ్చే అనారోగ్య సమస్య. ఇది డీహైడ్రేషన్‌తో శరీరం ఉష్ణోగ్రత నియంత్రణ వ్యవస్థకు అంతరాయం కలిగిస్తుంది. WebMD ప్రకారం.. కోర్ శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారెన్‌హీట్ కంటే ఎక్కువగా పెరగడం వల్ల వికారం, మూర్ఛ, అపస్మారకస్థితి వంటి లక్షణాలకు దారితీయవచ్చు.

### వడదెబ్బ లక్షణాలు

శరీరం వడదెబ్బకు గురైతే కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన తలనొప్పి వేధిస్తుంది. మైకం కమ్ముకొస్తుంది. శరీరం వేడిగా ఉన్నప్పటికీ చెమట పట్టకపోవడం, చర్మం పొడిబారడం, ఎరుపెక్కడం, వేడిగా మారవచ్చు. కండరాల తిమ్మిరి, బలహీనత, వాంతులు, వికారం, గుండె కొట్టుకునే వేగం మరింత పెరగడం, శ్వాస ప్రక్రియలో హెచ్చుతగ్గులు ఉంటాయి. అయోమయం, గందరగోళం, మూర్ఛపోవడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

### వడదెబ్బ చికిత్స

మండే వేసవిలో వడదెబ్బ బారిన పడితే బాధితుడికి చన్నీటి స్నానం చేయించాలి. ఇది శరీర ఉష్ణోగ్రతను చాలావరకు తగ్గిస్తుంది. మరణం, అవయవ నష్టం ముప్పును నివారిస్తుంది.

### ఐస్ ప్యాక్

వడదెబ్బ బారినపడినవారు వీపు, మెడ, గజ్జలు, చంకలు వంటి ప్రదేశాల్లో ఐస్ ప్యాక్‌లతో మర్దన చేసుకోవాలి. లేదా శీతలీకరణ ప్రభావం ఉండే దుప్పటితో కప్పుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రతను చాలా వరకు తగ్గించవచ్చు. వడదెబ్బ బారినపడిన వారిని వెంటనే చల్లగా గాలి తగిలే ప్రదేశానికి చేర్చాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ వాటర్, ఓఆర్ఎస్ తాగించాలి. దీంతో వేడి నుంచి ఉపశమనం లభిస్తుంది. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లిన వారికి బీపీ హెచ్చుతగ్గులతో కార్డియాక్ అరెస్ట్ రిస్క్ ఎక్కువగా ఉంటుంది. అందుకే వెంటనే ఆస్పత్రికి తరలించాలి.

### ముందు జాగ్రత్తలు ముఖ్యం

వడదెబ్బకు సకాలంలో చికిత్స తీసుకోకపోతే తీవ్ర పరిమాణాలకు దారితీయవచ్చు. శరీరంలో ఏదైన అవయవానికి నష్టం వాటిల్లవచ్చు. కొన్ని సందర్భాల్లో మరణం సంభవించవచ్చు. అందుకే ప్రతి ఒక్కరూ కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ ముప్ప తప్పించుకోవడానికి వేసవిలో తరచుగా నీళ్లు తాగుతూ శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. పగటి సమయంలో నీడ పాటున ఉండాలి. ఇంట్లో కూలర్, ఏసీ వంటి వాటిని ఉపయోగించుకోవాలి. ఈ వేసవిలో ఎక్కువ తీవ్రత ఉండే పనులకు దూరంగా ఉండాలి. సహజ శీతలీకరణ కోసం మజ్జిగ, కొబ్బరినీరు, నిమ్మరసం, పుదీనా వాటర్, సబ్జా వాటర్ వంటివి తరచూ తాగాలి. వేసవిలో లేత రంగులో వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. ఇవి శరీరం చెమటను త్వరగా పీల్చుకుని చికాకును నివారిస్తాయి. ఎండలకు తిరిగేటప్పుడు కళ్లకు కూలింగ్ గ్లాసెస్, తలకు టోపీ ధరించాలి. ఎండ అధికంగా ఉండే మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడమే మంచిది.